క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

భద్రాచలం/బూర్గంపాడు: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు), కృష్ణసాగర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు నేరుగా కళాశాలకు సంప్రదించి అడ్మిషన్లు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.హరిసింగ్ గురువారం ప్రకటనలో కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు జిల్లాలోని పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు తమకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు జిరాక్స్ సెట్లు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రిన్సిపాల్ టీజీటీడబ్ల్యూ ఆర్‌జేసీ (బాలురు) కళాశాల వద్ద సంప్రదించాలని పేర్కొన్నారు.

యాచకున్ని వృద్ధాశ్రమంలో చేర్చిన యువకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో గత కొంత కాలంగా మతి స్థిమితం లేక యాచిస్తున్న వృద్ధుడు.. అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే పలువురు వ్యక్తులు చేరదీసి చికిత్స చేయించి వృద్ధాశ్రమంలో చేర్పించిన ఘటన గురువారం జరిగింది. పట్టణంలోని చేతన మీ సేవ కేంద్రం నిర్వాహకులు భూక్య రంజిత్ నాయక్, మండలపల్లి రమేష్, నాగేంద్రబాబు, భీమ్ సింగ్‌లు ముందుగా ఆ వ్యక్తికి స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపజేసి భోజనం పెట్టించారు. అనంతరం సరోజని వృద్ధాశ్రమంలో చేర్చి వృద్ధాశ్రమం నిర్వాహకుడు రఫీకి రూ.1500 నిర్వాహణ ఖర్చులను అందజేశారు. కాగా ఆ వ్యక్తి గురించి పూర్తిస్థాయిలో ఆరా తీయగా మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన శేఖర్ తెలిసిందని తెలిపారు.

సేవలు అభినందనీయం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన శిరపు వీరరాఘవరెడ్డి (వీర్రాజు) పోస్టల్‌శాఖలో చేసిన సేవలు మరవలేనివని పోస్టల్ ఉద్యోగులు అన్నారు. గురువారం వీర్రాజు పోస్టల్‌శాఖలో 45 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్రాంచి పోస్టు మాస్టర్ ప్రసాద్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది దుర్గాప్రసాద్, సాగర్, పోతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవి హోమం

మణుగూరురూరల్: మండలంలోని ఐలమ్మనగర్‌లో వెలిసిన కనకదుర్గ సహిత పెద్దమ్మతల్లి ఆలయంలో పంచగ్రహ కూటమి, శనేశ్వర జయంతి అమావాస్య సందర్భంగా బ్రహ్మశ్రీ తుమోజు శ్రీనివాస ఆచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు యోగంద్ర ఆచార్యులు, కళ్యాణ్‌కుమార్, దేవేంద్ర ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యంగిరా దేవి హోమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎండు మిరపకాయలు, ఆవాలు, మిరియాలు, హోమ ద్రవ్యాలతో ప్రత్యేకంగా ఈ ప్రత్యంగిరా దేవి హోమాన్ని జరిపించారు. ప్రపంచంలో శాంతి నెలకొని పాడిపంట సమృద్ధిగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని హోమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదాత చారుగుండ్ల మురళీకృష్ణ-జ్యోతి దంపతులు, వారి కుమార్తె శ్రేయ లక్ష్మీదేవిలు సాయినాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాత మురళీకృష్ణ దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

అశ్వాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏ భాగస్వామ్యంతో మూడోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తున్న సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో బీజేపీ శ్రేణులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల అయిలయ్య, నాయకులు లింగారెడ్డి, కల్లూరి రామారావు, సున్నం సారయ్య, కోలా భాస్కర్, గోసుల రాములు, కొల్లు లింగారెడ్డి, కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

బూర్గంపాడు: సారపాకలోని సాకేతపురి ఆంజనేయ మందిరంలో గురువారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అమావాస్య అన్నప్రసాద వితరణ చేశారు. అర్చకులు శివసాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వై.కామేశ్వరరావు, ఎం.సతీష్, ఎం.సుబ్బారావు, వెంకటేశ్వర్లు, గోపి కిషోర్, రాంప్రసాద్, సురేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- వెల్ఫేర్‌లో దూసుకెళ్తున్న సింగరేణి
- రూ.కోట్ల వ్యయంతో వసతులు ఏర్పాటు
- సమస్యల పరిష్కారానికి కృషి


అంబేడ్కర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్..

మణుగూరుటౌన్: దేశం, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం వహిస్తుండటంతో పాటు దేశానికి వెలుగులు పంచుకున్న సింగరేణి.. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోంది. స్వేదం చిందించి బొగ్గును వెలికితీస్తున్న కార్మికుల సౌకర్యాలకు కోరిన వెంటనే కోట్ల వ్యయం వెచ్చించి కావాల్సిన వసతులు కల్పిస్తోంది. నిర్దేశించిన లక్ష్యాలు సాధించి మణుగూరు ఏరియాను ఉత్పత్తి, ఉత్పాదకతల్లో ముందుంచే కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కార్మిక నేతల వినతులను యాజమాన్యం స్వీకరిస్తోంది. వాటిని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తోంది. మణుగూరు ఏరియాలో కార్మికుల సంక్షేమానికి సింగరేణీయుల కుటుంబ సభ్యులకు ఉపయోగపడే అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఆటలంటే ఇష్టం ఉన్న కార్మికులను కోల్ ఇండియా స్థాయికి వెళ్లే విధంగా ప్రోత్సహిస్తోంది.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



మణుగూరు ఏరియాను నిర్దేశించిన లక్ష్య సాధనలో ఉత్పత్తి, ఉత్పాదకతలలో ముందుంచుతున్న కార్మికుల కోసం యాజమాన్యం పెద్దపీట వేస్తోంది. సింగరేణి కార్మికుల సౌకర్యార్థం ఓపెన్ జిమ్, ఇండోర్ జిమ్‌లను సైతం ఏర్పాటు చేయడంలో యాజమాన్యం వెనుకడుగు వేయడం లేదు. యూనియన్ల నుంచి వచ్చిన వినతులతో పాటు కార్మికుల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. వెల్ఫేర్ విషయంలో యాజమాన్యం మణుగూరు ఏరియాకు తొలి ప్రాధాన్యతనిస్తోంది.

– దుర్గం రామచందర్, ఏరియా జీఎం

అభివృద్ధి పనులివి..

- భద్రాద్రి స్టేడియంలో రూ.10లక్షలతో ఆధునాతన జిమ్ సౌకర్యం ఏర్పాటు
- అంబేడ్కర్ పార్క్‌లో రూ.5లక్షల ఓపెన్ జిమ్ ఏర్పాటు
- షటిల్ ఆడేందుకు భద్రాద్రి స్టేడియం, ఇల్లెందు క్లబ్‌లో రెండు రూ.12లక్షల విలువైన సింథటిక్ కోర్టులు
- రూ. 20లక్షల వ్యయంతో సకల హంగులతో ఏసీ కమ్యూనిటీ హాల్‌తో పాటు రూ.7లక్షల వ్యయంతో వివాహ వధూవరులకు రెండు ఆధునాతన గదుల ఏర్పాటు
- రూ.35 లక్షలతో పార్క్ చుట్టూ కాంపౌండ్ వాల్‌తో పాటు ఆకర్షించే విధంగా రంగు రంగుల బొమ్మలు ఏర్పాటు
- సింగరేణి ఉత్పత్తిలో కీలక భాగస్వామ్యం వహించే ఆపరేటర్లకు 1.20 కోట్లతో ఎంసీ క్వార్టర్స్‌లో కార్ పార్కింగ్ షెడ్లు నిర్మాణం
- కార్మికుల రాకపోకలకు వానాకాలం ఇబ్బందులు లేకుండా రూ.80 లక్షలతో కోడిపుంజుల వాగుపై బ్రిడ్జి ఏర్పాటు
- సేవా సమితి భవన్ ఏర్పాటుకు రూ.8.60 లక్షలతో పాటు మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం గ్రీన్ రూమ్స్‌కు రూ.7లక్షలు కేటాయింపు
- రూ.12 లక్షలతో సంత చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

ఇలా ఎన్నో విషయాల్లో కార్మికులు, వారి కుటుంబాల శ్రేయస్సు కోసం యాజమాన్యం నిధులు కేటాయిస్తోంది. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. కార్మికులకు సహకారాలు అందించడంలో సింగరేణి యాజమాన్యం ఇకముందు కూడా ఇదే దోరణిలో కొనసాగాలని సంస్థ కార్మికులు, కార్మిక సంఘాల వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తాం

చంద్రుగొండ: పచ్చిరొట్ట విత్తనాలు అర్హులైన రైతులందరికీ పంపిణీ చేస్తామని అశ్వారావుపేట డివిజన్ సహాయ సంచాలకులు యండి.అఫ్జల్‌బేగం అన్నారు. రైతులు 'పచ్చిరొట్ట విత్తనాలకు ఎదురు చూపులు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆమె.. చంద్రుగొండలో పర్యటించారు. స్థానిక రైతువేదికలో రైతులతో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు 3వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అవసరం ఉన్నట్లు ప్రతిపాదన పెట్టామన్నారు. అయితే నియోజకవర్గం మొత్తం 1250 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 46 వేల ఎకరాల్లో వరి, 18 వేల ఎకరాల్లో పత్తి , 4వేల ఎకరాల్లో మిర్చి, 7వేల ఎకరాల్లో వేరుశనగ, 12వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సేద్యం చేసేందుకు రైతులు సన్నద్ధం అయినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్, ఏఈఓలు విజయ్, శ్రీనివాస్, భాను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

బకాయిలు చెల్లించాలని ధర్నా

భద్రాచలంఅర్బన్: గడిచిన ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదలను చేయాలని కోరుతూ సీఐటీయూ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పటల్ ఎదుట గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ.. భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో కొత్త కాంట్రాక్టర్ వచ్చిన దగ్గర నుంచి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గత ఐదు నెలల నుంచి వేతనాలు లేకుండా కార్మికులు ఎలా పనిచేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి, ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇస్తేనే కార్మికులు పనిలోకి వెళ్తారని ఆయన హెచ్చరించారు. అనంతరం ఏరియా ఆస్పత్రి ఆర్ఎం డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో చర్చలు జరపగా.. ఈనెల 9 తారీకు నాటికి పెండింగ్ ఐదు నెలల జీతాలుపై అధికారులతో మాట్లాడి కార్మికుల అకౌంట్లో వేస్తామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కార్మికులు సమ్మె నోటీస్ అందించారు. ఈనెల 9న కార్మికుల ఎకౌంట్లో వేతనాలు పడకుంటే 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి సంఘీభావం తెలపగా సీఐటీయూ సీనియర్ నాయకులు బండారు శరత్ బాబు, వైవి రామారావు, పి.సంతోష్ కుమార్, ఎస్ నాగరాజు, భూపేందర్, ఉబ్బ రమా, కృష్ణ, శ్రీకాంత్, రమాదేవి, నరసింహారావు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లిలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివాసీలకు విద్య, ఆరోగ్యం, సామాజిక విలువలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం కలిగి ఉండడమే కాక సమాజంలో విలువలతో జీవిస్తే అందరికీ మేలు జరుగుతుందని తెలిపారు. చదువుతో స్వతహాగా అభివృద్ధి సాధించడమే కాక ప్రపంచాన్ని జయించే శక్తి వస్తుందని చెప్పారు. ఇక ఆదివాసీలు ఆరోగ్యం విషయంలో ఇంకా వెనకబాటలో ఉన్నారని, దీనికి కూడా శాస్త్రీయమైన విద్య లేకపోవడమే కారణమని తెలిపారు. ఈ మేరకు మూఢనమ్మకాలను విడనాడి అనారోగ్యం ఎదురైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో ఏటీడీఓ పూనెం నర్సింహరావు, హెచ్ఎంలు మడకం మోతీరు, పీసోడి లక్ష్మయ్యతో పాటు ముర్రం వీరభద్రం, కారం సర్వేశ్వరావు, పాయం వెంకటరత్నం, హరికృష్ణ, అపక నాగేశ్వరావు, సున్నం సత్యనారాయణ, రేసు ఆదినారాయణమూర్తి, కొర్సా రామచంద్రయ్య, తెల్లం రామకృష్ణ, కణితి ముత్తయ్య, కల్లూరి ప్రసాద్, శ్రీనివాస వర్మ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్త

'నీట్'లో 573వ ర్యాంక్


రిషిత

కరకగూడెం: ఇటీవల వెల్లడైన నీట్ ఫలితాల్లో కరకగూడెం మండలం తాటిగూడెంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పోలేబోయిన గంగరాజు– ధనలక్ష్మి కుమార్తె రిషిత 720 మార్కులకు 596 మార్కులతో ఎస్టీ కోటాలో 573 ర్యాంక్ సాధించింది. అలాగే, జనరల్ కోటాలో 85,146 ర్యాంకు దక్కించుకుంది. రిషిత ఏపీలోని ఏటపాక నవోదయలో 12వ తరగతిలో 89శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆ తర్వాత లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకుని నీట్‌లో మెరుగైన ర్యాంకు సాధించడంతో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

'అమ్మ కోసం' క్లినిక్ ప్రారంభం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అమ్మకోసం క్లినిక్‌ను గురువారం డాక్టర్ కనకం తనుజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంటిపిల్లల తల్లులు పడే ఇబ్బందులు, చిన్నపిల్లలకు తల్లులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించడమే అమ్మకోసం క్లినిక్ ఉద్దేశమన్నారు. ప్రతి గురువారం క్లినిక్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని అన్నారు.

రైతులను మోసగిస్తే చర్యలు

కరకగూడెం: నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులను అంటగట్టి మోసం చేస్తే చర్యలు తప్పవని కరకగూడెం ఏఓ చటర్జీ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం భట్టుపల్లి రైతు వేదిక వద్ద మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, విత్తనాలు,ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీ ధరకు మించి అమ్మకూడదని సూచించారు. రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని బిల్లులపై ఖచ్చితంగా రైతు సంతకం తీసుకోవాలని పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు సరైన అవగాహన కలిగి ఉండాలని, తద్వారా భవిష్యత్తులో జరిగే పంట నష్టాలకు తగిన పరిహారాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

ములకలపల్లి: షాపుల్లో విత్తనాల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజ్‌కుమార్ రాజ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని విత్తనాల విక్రయ దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్టిఫైడ్ విత్తనాలను అమ్మాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులకు ఖచ్చితంగా బిల్లులు ఇవ్వాలని, వివరాలన్నీ సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. వ్యవసాయాధికారిణి కరుణామయి, కానిస్టేబుల్ రామకృష్ణ ఉన్నారు.

ఆర్‌టీఏ కార్యాలయం సందర్శన

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం స్థానిక ఆర్‌టీఏ సబ్ యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి వచ్చిన వాహనదారులతో మాట్లాడి.. అధికారులు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌టీఏ సేవల కోసం 80 కిలోమీటర్ల దూరంలోని కొత్తగూడెం వెళ్లాల్సి వచ్చేదని, ఈ సమస్యను పరిష్కరించేందుకు అశ్వారావుపేటలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. అనంతరం ఆర్‌టీఏ కార్యాలయంలో తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ కోసం దరఖాస్తు అందించారు.

అవగాహన అవసరం

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో తలసేమియ, సికిల్‌సెల్‌లపై ఈ ప్రాంత ప్రజలకు అవగాహన అవసరమని రెయిన్‌బో వైద్య నిపుణులు వీణ అక్కినేని అన్నారు. గురువారం భద్రాచలంలోని వెన్నెల పిల్లల ఆస్పత్రిలో విజయవాడ రెయిన్‌బో తరుపున స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ క్రాపా విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తలసేమియ, సికిల్‌సెల్ బాధితులు భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నారని, వారికి అవగాహన కల్పించేందుకు, వ్యాధి నిర్ధారణ చేసేందుకు అతి తక్కువ ఖర్చుతో సేవలు అందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ పెడియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, భద్రాచలం ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే


సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ భారీ మెజార్టీ గెలుపు నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మహబూబాద్ పార్లమెంట్‌కు పినపాక నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ అందించడంపై నాయకుల, కార్యకర్తల పనితీరును సీఎం అభినందించినట్లు ఎమ్మెల్యే ఫోన్‌లో తెలిపారు. పినపాక నియోజకవర్గ పెండింగ్ పనులతో పాటు ప్రధాన సమస్యలైన పులుసుబొంత ప్రాజెక్ట్, అటవీ అనుమతుల కోసం వేచి చూస్తున్న పనుల వివరాలు వివరించగా.. సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరామర్శించారు. మొద్దులగూడెం గ్రామానికి చెందిన దొడ్డా కృష్ణయ్య, కర్లపూడి బాబు, సున్నా చంద్రరావు, కందుల భిక్షం తదితరులు ఇటీవలే అనారోగ్య సమస్యల కారణంగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వారి ఇంటివద్దకే వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. ఈ మేరకు ఆ శాఖ కొత్తగూడెం జిల్లా పరిశీలకుడు పి.బెయిల్ సింగ్ పర్యవేక్షణలో అమ్మవారి ఆలయంలోని హుండీలను తెరిచి లెక్కించగా.. ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు రూ.58,665 రూపాయాల ఆదాయం సమకూరినట్లు తేలింది. ఆలయ ఈఓ సూర్య ప్రకాష్, గ్రామపెద్దలు నరాల శ్రీను, ఆలపాటి నరేంద్ర, జక్కుల జగదీష్, నారం జగదీష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలకు మళ్లీ పరీక్షలు సరికాదు

చంద్రుగొండ: ఆశావర్కర్లకు పరీక్షలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని ఆశవర్కర్ల మండల సంఘం అధ్యక్షురాలు జనగాం రుక్మిణి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె సంఘం సభ్యులతో కలిసి వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అరుణ, రమాదేవి, రాజేశ్వరి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: జిల్లాలో జరిగే ఇఫ్టూ ఏరియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూధన్‌రెడ్డి గురువారం కార్మికవర్గానికి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మిక ఉద్యమాల నిర్మాణం కోసం, ఇఫ్టూ మరింత బలోపేతం కోసం మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఇల్లెందు ఏరియాలో, 10న కొత్తగూడెంలో, 11న టేకులపల్లిలో, 13న గుండాలలో, 15న పాల్వంచలో, 16న మణుగూరు, భద్రాచలం ఏరియాల్లో మహాసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రమేష్, గోపాలరావు, వెంకన్న, చంద్రశేఖర్, మల్సూర్, వెంకటేశ్వర్లు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జనసభ..

అశ్వాపురం: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు, వర్గీకరణ సాధనకు నేడు పాల్వంచలో జరిగే మాదిగ జనసభను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా నాయకుడు దేవంగి వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి పాల్గొంటున్న జనసభలో మాదిగ జేఏసీ శ్రేణులు, మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం నాయకులు నాగేష్, నరేష్, విజయ్, అనిల్, నర్సింహారావు, వెంకటరాజు, నాగేష్, రాము, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడిగా శేషు

ములకలపల్లి: మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడిగా ములకలపల్లికి చెందిన కొట్టే శేషు ఎన్నికయ్యారు. పాల్వంచలో జరిగిన సమావేంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేశ్.. శేషును మండల అధ్యక్షుడిగా ప్రకటిస్తూ గురువారం నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. లక్ష్మణ్, మధు, ప్రవీణ్, జోషీ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే..

నియోజకవర్గాల్లోని ఆయా ప్రాంతాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వీధుల్లో పర్యటించారు. బడిలో చేరే వయస్సు ఉండి ఇంటి వద్దే ఉంటున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు, బడి ఆవిష్యకతను వివరించారు. అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. మూడు ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో, 5 ఏళ్లు నిండిన పిల్లల్ని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: పార్కలగండి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ..


భద్రాచలంఅర్బన్: బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు


బూర్గంపాడు: సోంపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


అశ్వారావుపేటరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


అన్నపురెడ్డిపల్లి: బడిబాట ర్యాలీ..


దుమ్ముగూడెం: మహాదేవపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


మణుగూరురూరల్: బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు


చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు